



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

గురువారం,
ఫిబ్రవరి 26, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-



# వెలిగొండ నుంచి జూలైనాటికి నీరిస్తాం

- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్ నిర్మిస్తామని వెల్లడి
- జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చారని విమర్శ
- వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం



ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని

- మిగతా 2వ పేజీలో



# మ్యాన్యుఫాక్చరింగ్ పవర్‌గా తెలంగాణ

- ఉద్యోగాలపై ఏఐ, నైపుణ్యాభివృద్ధి, కొత్త అవకాశాలపై చర్చ
- ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై వారి మధ్య చర్చ
- రాష్ట్రాన్ని తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉందన్న సీఎం

హైదరాబాద్: రాష్ట్రాన్ని మ్యాన్యుఫాక్చరింగ్ పవర్‌గా తీర్చిదిద్దాలని, ఇందుకు కొన్ని ముఖ్యమైన సంస్థలను ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. అడోబ్ సీఈఓ, తెలంగాణ రైజింగ్2047 విజన్ బోర్డు సభ్యులు శంతను నారాయణ్ బుధవారం సీఎం రేవంత్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్థిక వ్యవస్థపై ఏఐ టెక్నాలజీ విప్లవ ప్రభావం, రాబోయే రోజుల్లో ఈ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకునే అంశాలపై శంతను నారాయణ్‌తో సీఎం చర్చించారు. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు మరింత సహకరించాలని సీఎం కోరారు. గ్లోబల్ ట్రెండ్స్, అవకాశాలపై ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన

- మిగతా 2వ పేజీలో

## పారిశ్రామికాభివృద్ధికి 'క్లస్టర్' వ్యూహం.

- ఉద్యోగాల కల్పనపై మంత్రి లోకేష్ కీలక ప్రకటన
- క్లస్టర్ల విధానంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వ ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల గుర్తించామన్న మంత్రి లోకేశ్
- ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణ, ఉద్యోగావకాశాలకు 'నైపుణ్యం' పోర్టల్
- పరిశ్రమల భాగస్వామ్యంతో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల బలోపేతం



2లో

## తెలుగు రాష్ట్రాల మధ్య తొలి గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మేలో ప్రారంభం!

- ఖమ్మం-దేవరపల్లి మధ్య సిద్ధమైన తొలి గ్రీన్‌ఫీల్డ్ హైవే
- మే నెలలో ఈ రహదారిని ప్రారంభించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఏర్పాట్లు
- హైదరాబాద్-విశాఖ మధ్య 56 కిలోమీటర్ల ప్రయాణ దూరం ఆదా
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఆటోమేటిక్‌గా చలాన్లు జారీ చేసే వ్యవస్థ
- ప్రయాణించిన దూరానికే టోల్ వసూలు చేసే సరికొత్త విధానం

2లో

## స్టిక్కర్లపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదని విమర్శ

- 'డయేరియా' మరణాలపై ధర్మాన ప్రసాదరావు ఫైర్
- కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్న ధర్మాన
- ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని వ్యాఖ్య



## తెలంగాణలో హత్యా రాజకీయాలు

- కుమ్మెర జాతర ఘటనపై కేటీఆర్ ఆగ్రహం
- 2చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్
- సమాజం తలదించుకోవాల్సిన ఘటన జరిగిందన్న కేటీఆర్
- నిందితులను కాపాడే ప్రయత్నం సిగ్గుమాలిన చర్య అన్న కేటీఆర్






# కుమ్మెర గ్రామ సంఘటన పసిపాప మృతి పై... రెడ్ స్టార్ సుక్క రాంనర్సయ్య గలమెత్తిన పాటపై... రజకుల్లో చైతన్యం!

## ఉద్యమం ఉధృతం కానున్న నాగర్ కర్నూల్, కుమ్మెర గ్రామ సంఘటన.!

## కుమ్మెర రజకుల ఉద్యమానికి ఊపిరి పోసిన సుక్క రామనర్సయ్య పాట.!

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో ఈనెల 18న జరిగిన మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజక కుటుంబం స్వామివారి దర్శనం కోసం టికెట్లు లేకుండా గుడిలోకి ప్రవేశించారని ఆ గ్రామ సర్పంచ్ అగ్రకులాల వ్యక్తి రజకులను బూతులు తిడుతూ, విచక్షణ రహితంగా ప్రవర్తించి, రజకులపై దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించడం, ఆ సంఘటనలో రెండు నెలల పసిపాపని అని కూడా చూడకుండా అతి కిరాతకంగా తన్ని ఆ చిన్నారి మృతికి కారకులైన వారిపై ఎన్నో బీసీ సంఘాలు ఉద్యమాలు చేపట్టిన, అన్ని రాజకీయ పార్టీలు ఆరోపణలు చేస్తూ ఉద్యమాలు చేపట్టిన, ప్రతిపక్ష నాయకుడు కేటీఆర్ వచ్చి ఆర్థిక సహాయం అందించిన, ఇతర హామీలు ఇచ్చిన, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడం నేటి వరకు జరిగిన వాస్తవం.! నేడు ప్రజా గొంతుక రెడ్ స్టార్ సుక్క రాంనర్సయ్య పాటతో యూట్యూబ్, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ సాంగ్ తో బీసీ సామాజిక వర్గంలో కదలిక మొదలైంది.! ఉద్యమం ఉధృతం కానుంది.! సుక్క రాంనర్సయ్య పాట ప్రజల్లోకి వెళ్ళింది ప్రజల్లో ఆలోచన మొదలైంది, బీసీ సంఘాల్లో చలనం మొదలైంది, ఇక నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామ సంఘటన మరో తెలంగాణ తరహాలో ఉద్యమం ఉధృతం కాబోతున్ననేది అని స్పష్టంగా కనబడుతుంది, ప్రభుత్వం దిగివస్తే తప్ప, దుర్మార్గులను శిక్షిస్తే తప్ప, ఈ ఉద్యమం ఆగే పరిస్థితులు కనబడడం లేదు అని పలువురు రాజకీయ విశ్లేషకులు, ఉద్యమకారులు, బీసీ సంఘాల నాయకులు తెలుపుతున్నారు. రెడ్ స్టార్ ప్రజా గొంతుక సుక్క రాంనర్సయ్య పాట ఉద్యమాన్ని ఎటు తీసుకుపోతుందో వేచి చూడాలి



# ప్రాజెక్టు పూర్తి కాకుండానే వైసీపీలా రిబ్బన్ కటింగ్ చేసి దొంగనాటకాలు ఆడటం చేతకాదు: ముఖ్యమంత్రి చంద్రబాబు

**ఈ ఏడాది జులైకి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి నీళ్లు ఇస్తామని హామీ**

**దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్ నిర్మిస్తామని వెల్లడి**

**జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం**

**గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చారని విమర్శ**

**వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన**

**మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం**



మార్కాపురం: ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ, "గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

### శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది

"1996, మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్లారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలిగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటి రోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయి" అని ముఖ్యమంత్రి అన్నారు.

### రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు

"అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్ కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జులై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రినీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండ పై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

### రూ.50 కోట్లతో జిల్లా కలెక్టరేట్ నిర్మిస్తాం

"ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫోటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనానికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం. వరద నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.

# స్టిక్కర్లపై ఉన్న శ్రద్ధ సమస్యల పరిష్కారంలో లేదని విమర్శ

శ్రీకాకుళం జిల్లాలో ప్రబలిన డయేరియా బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గత 20 నెలల కూటమి పాలనలో ప్రజారోగ్యం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు శాపంలా మారాయని మండిపడ్డారు.

అతిసార వ్యాధితో జిల్లాలో నలుగురు ప్రాణాలు కోల్పోతే, ప్రభుత్వం మాత్రం కేవలం ఒకరు లేదా ఇద్దరే చనిపోయారని అబద్ధపు లెక్కలు చెబుతోందని ధర్మాన ఆరోపించారు. "వాంతులు, విరోచనాలతో ప్రజలు అల్లాడుతుంటే, సహాయం చేయాల్సింది పోయి పోస్టుమార్టం నివేదికలంటూ కాలయాపన చేస్తున్నారు. గత డిసెంబర్‌లోనూ బలగ ప్రాంతంలో ఇలాగే డయేరియా విజృంభించినా ప్రభుత్వం పాఠాలు నేర్చుకోలేదు. ప్రస్తుతం 100 మందికి పైగా రోగులు ఆసుపత్రుల పాలయ్యారు. మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు వేసుకోవడంపై ఉన్న శ్రద్ధ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో లేదు" అని ధ్వజమెత్తారు. ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు అందించాలనే గత ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రైవేటీకరణ పేరుతో తుంగలో తొక్కారని ధర్మాన విమర్శించారు. రాజధాని పేరుతో డబ్బునంతా ఒకే చోట కుమ్మరిస్తూ, జిల్లాల అభివృద్ధిని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. సాగుకు యూరియా అందక రైతులు, ఇంగ్లీషు మీడియం చదువులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యానికి మద్దతు ధర లేకపోగా, క్వింటాల్‌కు రెండు కిలోల చొప్పున అదనంగా దోచుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. శ్రీకాకుళం అభివృద్ధి కోసం కనీసం వెయ్యి కోట్లు అయినా ఖర్చు చేశారా? అని ప్రశ్నించిన ఆయన... ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని హెచ్చరించారు. ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

# దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

కడప జిల్లా వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలోని నందీశ్వర ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్ పాల్గొన్నారు. శివ నామస్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణంలో జగన్ సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమాలు, ప్రత్యేక అభిషేకాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. "భక్తి మార్గం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పునర్నిర్మాణం జరగడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నందిపల్లిలో ఈ మహోత్సవాన్ని ఒక పండగలా నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య తొలి గ్రీన్‌ఫీల్డ్ హైవే.. మేలో ప్రారంభం!

తెలుగు రాష్ట్రాల మధ్య రహదారి రవాణా వ్యవస్థలో సరికొత్త శకం ప్రారంభం కానుంది. ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి వరకు నిర్మించిన తొలి యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేని మే నెలలో ప్రారంభించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (చీనాూ×) ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఈ నాలుగు వరుసల రహదారి అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే వారికి ఈ రహదారి ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ప్రస్తుతం సూర్యాపేట, విజయవాడ మీదుగా 676 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉండగా, ఈ కొత్త మార్గం ద్వారా 56 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. మొత్తం 162 కిలోమీటర్ల పొడవున రూ.4,451.87 కోట్ల వ్యయంతో ఈ రహదారిని అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించారు. 95 శాతం పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. ఈ హైవే అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది. అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ూుమీూ) ద్వారా ప్రతి 2 కిలోమీటర్లకు ఒక 360-డిగ్రీల సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. అతివేగం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం వంటి ఉల్లంఘనలను ఈ కెమెరాలు గుర్తించి ఆటోమేటిక్‌గా చలాన్లు జారీ చేస్తాయి. రహదారిపైకి ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణించారో, ఆ దూరానికే టోల్ వసూలు చేస్తారు. ఇందుకోసం కేవలం 9 చోట్ల మాత్రమే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను ఏర్పాటు చేశారు.

# మ్యాన్యుఫాక్చరింగ్ పవర్‌గా తెలంగాణ

చర్యలను సీఎంకు శంతను నారాయణ్ వివరించారు. గ్లోబల్ మ్యాన్యుఫాక్చరింగ్, గ్రీన్ ఎనర్జీ, ఉద్యోగాలపై ఏఐ ప్రభావం, స్కిల్లింగ్ అండ్ రిస్కిల్లింగ్‌కు సంబంధించిన అంశాలను తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో గత మూడు రోజులుగా యాగం జరిగినట్టు తెలుస్తోంది. కుటుంబసభ్యులతో కలిసి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన చండీయాగం బుధవారం ముగిసినట్టు సమాచారం. అయితే, ఈ యాగం నిర్వహణ గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. గతంలో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయం నుంచే రేవంత్‌రెడ్డి యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, ఇందులో ప్రత్యేకత ఏమీ లేదని సీఎం సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

# తెలంగాణలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయి

తెలంగాణలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని, సమాజం తలదించుకోవాల్సిన ఘటన కుమ్మెర జాతరలో జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. కుమ్మెర జాతరలో మృతి చెందిన చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుమ్మెర గ్రామస్థులు ఈరోజు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు మద్దతు తెలిపిన కేటీఆర్ మాట్లాడుతూ, ఈనాటికీ కులం పేరు మీద దాడులు దారుణమని అన్నారు. రెండేళ్ల చిన్నారికి కులం తెలుసా, మతం తెలుసా, పసిగుడ్డు ఏం అడిగిందని పొట్టన పెట్టుకున్నారని మండిపడ్డారు. ఈ ఘటనకు కారణమైన 8 మందిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారి ప్రాణాలు తీసిన వారికి ఎవరూ అండగా నిలవవద్దని అన్నారు. నిందితులను కాపాడేయత్నం సిగ్గుమాలిన చర్య అన్నారు.



## కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్

కాప్రా, వార్త మిర్రర్, ఫిబ్రవరి 25 : కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ బుధవారం టిఎస్ఐఐసీ కాలనీలోని ప్రెస్ క్లబ్ లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సలహాదారులు ఏంపల్లి పద్మారెడ్డి, బెలిదే అశోక్, అధ్యక్షులుగా మెరుగు చంద్రమోహన్, ఉపాధ్యక్షులుగా దిలీప్ కుమార్, యావాపురం రవి, దొమ్మాటి కిరణ్ కుమార్, గార్లపాటి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, సంయుక్త కార్యదర్శిగా డి. శ్రీనివాస్, కె. వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఓ. నరసింహ, కీర్తి శ్రీనివాస్, కోశాధికారిగా రామచంద్రమూర్తి, కార్యవర్గ సభ్యులుగా గంగి కృష్ణ, గోవిందు కుంట్ల ఆంజనేయులు, బుడంపల్లి నిరంత్ గౌడ్, తొడుపునూరు బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమను కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారిగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సభ్యుల ప్రతినెల ఈఎస్ఐ చెల్లింపు, 60 లక్షల రూపాయల వ్యక్తిగత పాలసీ, నూతన సభ్యులకు సభ్యత్వాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పలువుల పవన్, శ్రీనివాస్ రెడ్డి, విజయ్, వెంకటాపురం రవి, సింగం రాజు, మోహన్ రెడ్డి, హుస్సేన్, పాండు గౌడ్, రియాజ్, చిత్తారి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి అభినందనల వెల్లువ

కాప్రా, వార్త మిర్రర్ ,ఫిబ్రవరి 25 :కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి పలువురు ప్రజా ప్రతి నిధులు, నాయకులు అభినందనలు తెలిపారు. అధ్యక్షులుగా మెరుగు చంద్ర మోహన్,ప్రధాన కార్యదర్శిగా ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారిగా రామచంద్ర మూర్తిలతో పాటు కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం పేరుపేరునా అభినందనలు తెలిపారు. ఏఎస్ రావునగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, పజ్జూరి పావని రెడ్డి, కొత్త రామారావు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్త అంజిరెడ్డి, బొజ్జ రాఘవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి నీరుకొండ సతీష్ బాబు, బిజెపి చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, సీనియర్ నాయకులు కనుకుల రజినీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమారస్వామి, నాయకులు ఎస్.ఎ. రహీమ్ తదితరులు అభినందనలు తెలిపారు.



## భూపతిపూర్ ఉన్నత పాఠశాల లో ఉచిత వైద్య శిబిరం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 25 జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూపతిపూర్ నందు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యం లో 115 మంది బాలికలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి అనీమియా తో బాధపడుతున్న 73 మంది బాలికలకు నెలకు సరిపడ మందులు, సానిటరి ప్యాడ్స్ పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు వారి ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో, రక్త హీనత ఎలా వస్తుందనే విషయాలను డాక్టర్లు శ్రీ హేమంత్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అచ్యుత్, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాహితీ చక్కటి సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా గ్రామ సర్పంచ్ శ్రీమతి గుర్రం భావన మహేందర్ ప్రారంభించారు. ఇందులో మాజీ సర్పంచ్ శ్రీ జక్కుల చంద్రశేఖర్ గారు, స్థానిక గ్రామీణ వైద్యులు డాక్టర్ శ్రీ జక్కుల రాజేంద్ర ప్రసాద్, సిస్టర్ రమ అలాగే ప్రకాష్, శ్రీనివాస్,ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, ఉపాధ్యాయులు తాటిపెల్లి వేణు గోపాల్, కమారుద్దీన్, కూరగాయల సురేష్, శైలజ లు పాల్గొన్నారు.



## శ్రీ సత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 25శ్రీ సత్య హాస్పిటల్ ఆధ్వర్యంలో రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో డాక్టర్ ఉదయ్ కుమార్ ఎం డి, డాక్టర్ సిహెచ్ శ్వేత క్రిటికల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా మహిళలు పురుషులు మొత్తం 234 మంది కి వారి సమస్యలు తెలుసుకుని దానికి అనుగుణంగా ఎముకల బలపరీక్ష, విటమిన్ డి3, ఇసీజీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సుమారు ఒక్కొక్కరికి 3000 రూపాయలు వరకు అయ్యే పరీక్షలు ఉచితంగా చేయగా అట్టి పరీక్షల రిపోర్టులు ఆధారంగా రోగులకు పాటించవలసిన నియమాలు వివరిస్తూ వారికున్న సమస్యను బట్టి ఉచిత మందులు ఇవ్వడం జరిగింది. ఇట్టి వైద్య శిబిరానికి గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు, గ్రామ యువకుల సహకారం వలన ఇట్టి ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతం చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## గుల్మోహర్ పార్క్‌లో ఘనంగా పతంజలి ఉచిత యోగా 8వ వార్షికోత్సవం...



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :గుల్మోహర్ పార్క్ కాలనీలోని పార్కులో గత 8 ఏళ్లుగా కొనసాగుతున్న పతంజలి ఉచిత యోగా తరగతుల వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సుమారు 100 మంది యోగా అభ్యాసకులు, రాష్ట్ర మరియు వెస్ట్ జోన్ హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు పాల్గొని హోమం, మంత్రోచ్చారణలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వివరాలను యోగా గురువులు నూనె సురేందర్ మరియు వెంకటేష్ తెలియజేశారు.యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర భారత్ స్వాభిమాన్ సమితి సంఘటనా కార్యదర్శి నందనం కృపాకర్ మాట్లాడుతూ.. నిత్యం యోగా చేయడం వల్ల శరీరంలోని అంతర్గత మరియు బాహ్య అవయవాలు దృఢంగా మారుతాయని పేర్కొన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా ఆయుష్షు పెరుగుతుందని ఆయన వివరించారు. రాబోయే 9వ వార్షికోత్సవం నాటికి వివిధ వార్డులలో కనీసం 50 యోగా తరగతులను ప్రారంభించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర పతంజలి అధ్యక్షులు శ్రీధర్, బి ఎస్ టి ఉపాధ్యక్షులు శివకుమార్, రాజేంద్ర చారి, భరత్, యోగా గురువు స్నేహ మరియు సీనియర్ అభ్యాసకులు రాజేంద్ర ప్రసాద్, సాయినాథ్, ప్రేమ్ చంద్, అన్నపూర్ణ, లక్ష్మి, గాయత్రి, విజయ, రమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అల్లిపూర్ గ్రామపంచాయతీ రికార్డులను తనిఖీ చేసిన డిఎల్పిఓ, ఎంపీఓ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 25

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో బుధవారం రోజున గ్రామపంచాయతీ కార్యాలయంలో డిఎల్పిఓ విమల, ఎంపీఓ సుష్మ పారిశుధ్యం, రికార్డుల అకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీని సందర్శించడం జరిగింది. వారిని గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా డిఎల్పిఓ విమల మాట్లాడుతూ...గ్రామపంచాయతీ సిబ్బందికి విధులను సక్రమంగా నిర్వర్తించి గ్రామపంచాయతీని ఉత్తమ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచనలను తెలియజేశారు. అనంతరం గ్రామపంచాయతీ సిబ్బందికి సబ్బులు, నూనెలు, బెల్లం వస్తువులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి శేఖర్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పాపని చంపిన వారికి మర్డర్ కేసు పెట్టాలి

### ...బోర్ర రవి మాదిగ

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 25 :

నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగినటువంటి సంఘటన ఆరు రోజుల క్రితం మల్లన్న గుడి దర్శనానికి చాకలి కులస్తులైన గణేష్ కుటుంబం సభ్యులు చంద్రమ్మ మౌనిక దర్శనానికి వెళితే మీరు తక్కువ కులపోలని గుడిమెట్లు ఎక్కువొద్దని అదే గ్రామానికి చెందిన సర్పంచ్ తుకారాం రెడ్డి మధుసూదన్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి చాకలి కులస్తులను దిబ్బందించి వారిని తన్ని వారిపై దాడి చేసి రెండు నెలల అమ్మాయిని కాళ్ళతో తొక్కి ఆ పాపని చంపడం జరిగింది ఈ సంఘటన దురదృష్టకరం వారిపై మర్డర్ కేసు పెట్టి వారికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి బోర్ర రవి మాదిగఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మస్కూరి సుధాకర్ డిమాండ్ చేశారు తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకు దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి ఇదే విధంగా కొనసాగితే ప్రభుత్వాలకు ప్రజలే బుద్ధి చెప్తారని ప్రజలే ప్రభుత్వాలపై తిరగబడి రోజులు త్వరలోనే ఉన్నాయని హెచ్చరిచారు



## సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధియాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ పాల్గొన్నారు.ముందుగా జయంతి వేడుకల సందర్భంగా బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించి అనంతరం సమావేశం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి,అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు,ఆర్డీవో కృష్ణ రెడ్డి, డీఆర్డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. బంజరాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ అన్నారు. గిరిజనుల సంస్కృతి సంప్రదాయంలను కాపాడిన మహనీయుడు,గిరిజనులను అహింస వైపు నడిపిన మహనీయుడు సేవ సత్యం సమానత్వం విలువలను బోధిస్తూ బంజరాల ఐక్యతకు సేవాలాల్ కృషిచేసారన్నారు.



## నిబంధనలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం...

మాదాపూర్ వార్త మిర్రర్ : ?ప్రాణాపాయం లేని సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం వాహనదారుల్లో కొత్త చైతన్యాన్ని నింపుతోంది. బుధవారం 100 ఫీట్ జంక్షన్ సమీపంలోని తేజస్విని టాటా మోటార్స్‌లో జరిగిన ఈ అవగాహన సదస్సులో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీధర్ కుమార్, ఆర్ఐ శ్రీకాంత్, ఎస్ఐ టీవీ రావు పాల్గొని రహదారి నిబంధనలపై దిశానిర్దేశం చేశారు. వాహనం నడిపేటప్పుడు లేన్ క్రమశిక్షణ పాటించాలని, హెల్మెట్ కేవలం రైడర్‌కే కాదు వెనుక కూర్చునే పిలియన్ రైడర్‌కు కూడా ప్రాణ రక్షణగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్‌బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించిన పోలీసులుడిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను ఎలా దూరం పెట్టవచ్చో ఇంటరాక్టివ్ సెషన్ ద్వారా అవగాహన కల్పించారు. టాటా మోటార్స్ జీఎం రాజు నేతృత్వంలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో, చిన్నపాటి అజాగ్రత్తలు కుటుంబాలకు తీరని లోటును మిగిలిస్తాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఇన్స్పెక్టర్ శ్రీధర్ కుమార్, ఆర్ ఐ శ్రీకాంత్, ఎస్ఐపి టీవీ రావు, జి.ఎం. రాజు తదితరులు పాల్గొన్నారు.





## యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మర్యాదపూర్వకంగా కలిసిన సంస్థాన్ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి -లింగస్వామి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

హైదరాబాద్ అన్వయ కన్వెన్షన్ ఫైనాన్షియల్ డిస్టిక్ లో కోమటిరెడ్డి మోహన్ రెడ్డి మనవరాలు వివాహ వేడుకలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు ను మర్యాదపూర్వకంగా కలిసిన సంస్థాన్ నారాయణపురం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి- లింగస్వామి ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు మాట కలుపుతూ మీ మెజార్టీని పలు సందర్భాల్లో చర్చించుకున్నామని తెలిపారు, గ్రామాల పర్యటనలో తప్పకుండా మీ గ్రామానికి వస్తానని తెలిపారు



## పరిశుభ్రత పై అవగాహన సమావేశం..

మాదాపూర్ వార్త మిర్రర్ :

మాదాపూర్ సర్కిల్-50 కార్యాలయంలో డీసీ బాలకృష్ణ, డిఈ రూప దేవి ఆధ్వర్యంలో 100 ఫీట్ రోడ్డు చంద్రనాయక్ తండా వీధి వ్యాపారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రోడ్లపై చెత్త వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను తప్పనిసరిగా స్వచ్ ఆటో టిప్పర్‌కే ఇవ్వాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి ఎస్ఎఫ్ఏలు అజారుద్దీన్, సంతోష్, అంకయ్య వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ నగర పరిశుభ్రతలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## నేటి నుండి ఇటిక్యాలలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు...



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 25

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరిపించుటకు ధర్మకర్తలు శ్రీ చెన్నమనేని విష్ణువర్ధన్, వంశీవర్ధన్ సారధ్యంలో ఏర్పాట్లు పూర్తయినట్లు అర్చకులు మరింగంటి రామకృష్ణాచార్యులు తెలిపారు.. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ 26 వ తేదీ నుండి మార్చి 05 వ తేది వరకు బ్రహ్మోత్స వాలు జరుగుతాయని ఆయన అన్నారు. 28 వ తేదీ శనివారం రోజున శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం, మహా అన్నదానం, మార్చి 4 బుధవారం రోజున స్వామివారి రథోత్సవం, జాతర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వాహకులు తెలిపారు..

## చెర్లకొండాపూర్ లో అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 25

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం చెర్ల కొండాపూర్ గ్రామానికి చెందిన పెండాల రజిని అనే మహిళా ఇల్లు విద్యుత్ వైర్లకు మంటలు రావడంతో రేకుల కింద ఉన్న బట్టలు నిత్యావసర సరుకులు దగ్ధం కాగ స్థానికులు స్పందించి మంటలు ఆర్పడంతో ప్రాణ ప్రమాదం తప్పింది. ఇంట్లో నిత్యావసర సరుకులు, బట్టలు తదితర గృహ వినియోగ విద్యుత్ పరికరాలు మంటల్లో కాలిపోవడంతో పూర్తిగా రోడ్డున పడ్డామని, ఇల్లు బాగు చేసుకునే ఆర్థిక స్థోమత లేక బస్టాండ్ సమీపంలో ఖాళీగా వాటర్ ప్లంట్ లో జీవనం సాగిసు న్నామని, ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిం చాలని, తక్షణమే ఇల్లు మంజూరు చెయ్యాలని బాధితురాలు విజ్ఞప్తి చేశారు.



## మంజీరా పైపులైన్ లీకేజీని పరిశీలిస్తున్న జాగృతి నాయకుడు కొల్లూరు కుమార్ కురుమ...

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం మదినాగుడా డివిజన్ పరిధిలోని మదినాగుడా ద్వారకా నగర్ వీకర్ సెక్షన్ కాలనీలో మంజీరా పైపులైను పగిలి నీరు వృధా అవ్వడంతో తెలంగాణ జాగృతి నాయకుడు కొల్లూరు కుమార్ కురుమ సంబంధిత హెచ్ యం డబ్ల్యు ఎస్ ఎస్ బి అధికారులకు తెలిపి మంజీరా పైపులైను లీకేజీని బాగు చేయించారు. ఈ కార్యక్రమంలో మదినాగుడా డివిజన్ తెలంగాణ జాగృతి నాయకుడు కొల్లూరు కుమార్ కురుమ, హెచ్ యం డబ్ల్యు ఎస్ ఎస్ బి వర్కర్లు పాల్గొన్నారు.



## పుస్తకం మనిషిని మార్చే శక్తి కలిగిన ఆయుధం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఫిబ్రవరి 25

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సంచార నవచేతన పుస్తక బస్సును సిపిఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకం మనిషిని మార్చే శక్తి కలిగిన ఆయుధమని, జ్ఞానం పెరిగితేనే సమాజం ముందుకు వెళుతుందని ప్రతి గ్రామానికి పుస్తకాలు చేరాలని పేర్కొన్నారు. సాధారణ జ్ఞానం సాహిత్య గ్రంథాలను విస్తృతంగా చదవాలని సూచించారు. చదువుల పట్ల ఆసక్తి పెంచడానికి సంచార గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని అభిప్రాయపడ్డారు.గ్రామాల్లోకి పుస్తకాలు తీసుకువచ్చే ప్రయత్నం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడత రామలింగం, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీరామ కూరగాయల కమిటీ ఆధ్వర్యంలో పదో వార్డ్ కౌన్సిలర్ దీప రమ్య రాజు కు సన్మానం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఫిబ్రవరి 25

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీరామ కూరగాయల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో 10వ వార్డ్ కౌన్సిలర్ దెప రమ్య రాజు ని ఘనంగా సన్మానించారు. అనంతరం కౌన్సిలర్ రమ్య రాజు మాట్లాడుతూ శ్రీరామ కూరగాయల మార్కెట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తారని అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ కూరగాయల మార్కెట్ అధ్యక్షులు దేప రాజు, ఉపాధ్యక్షులు పిల్లలమర్రి జగదీష్,బొబ్బిళ్ళ కాళేశ్వర్, ప్రధాన కార్యదర్శి బాబు,కార్యదర్శి యాట రాజు, కోశాధికారి రషీద్,సాంస్కృతి కార్యదర్శి పాశం వెంకటేశం, ప్రచార కార్యదర్శి కొడాలి దిలీప్, గౌరవ అధ్యక్షులు పిల్లలమర్రి యాదగిరి,గుండ్ల శంకరయ్య, నిమ్మల మల్లేశం ,తదితరులు పాల్గొన్నారు..

# ఇంటర్ పరీక్షలకు గొర్రెల, బర్రెల వాహనంలో విద్యార్థులు

**కాసుల కోసం కక్కుర్తి కొమ్మేపల్లి ప్రధానోపాధ్యాయులు**

**ఈ వాహనంలో తరలిస్తే తమకేంటంటూ నిర్లక్ష్య సమాధానం**

**ఇంటర్మీడియట్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి**

**ప్రభుత్వ నియమ నిబంధనలు తుంగలో తొక్కేసిన ప్రధానోపాధ్యాయులు**

**వత్తాసు పలుకుతున్న జిల్లా అధికారులు**

**ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్టూడెంట్ ఆర్గనైజేషన్ డిమాండ్**





దేవరకొండ ఫిబ్రవరి 25 వార్త మిర్రర్:

దేవరకొండ మండలం కొమ్మెపల్లి గిరిజన బాలుర ప్రధానోపాధ్యాయుల నిర్వాకం నిర్లక్ష్యం. ఇంటర్ పరీక్షలు దేవరకొండ మండల కేంద్రంలో నిర్వహించగా సెంటర్ల వద్దకి విద్యార్థులను తరలించడానికి ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా వారి ఇష్టానుసారంగా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయులు..రాష్ట్రవ్యాప్తంగా మొదలైన ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు రవాణా మార్గం మౌలికంగా ఉండేటందుకు విద్యార్థులకు ఉపయోగకరమైన వాహనాలు ఏర్పాటు చేయడంలో జాప్యం వహిస్తూ గొర్రెలను బర్రెలను తరలించే బొలెరో వాహనంలో విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇదేంటని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫోన్ ద్వారా సంప్రదించగా అత్యవసర పరిస్థితుల్లో తరలించాల్సి వచ్చిందని ఈ బొలెరో వాహనంలో తరలిస్తే మీకు ఇబ్బంది ఏంటి అంటూ దురుసుగా మాట్లాడడం, తమకు ప్రత్యేకమైన వాహనాలలో తరలించాలన్న అనుమతులు ఏం లేవంటూ తోసిపుచ్చుతూ ఫోన్ పెట్టడం జరిగింది. మరలా సంప్రదించిన ఫోన్ ఎత్తకపోవడంతో జిల్లా అధికారి ఆర్ సి ఓ ను వివరణ కోరగా తమకు విషయం తెలియదంటూ విద్యార్థులను ప్రత్యేకమైన వాహనాల్లో పరీక్షా కేంద్రాలకు తరలించాలన్న నిబంధనలు కూడా తమకు తెలియదంటూ మాట్లాడడం గమనార్హం. ఈ విషయమై జిల్లా డిఐఈవో దస్రు నాయక్ ఫోన్ ద్వారా సమాచారం కోరగా తమకు కూడా తెలియదంటూ జిల్లా గిరిజన అధికారి ఆర్ సి ఓ ను సంప్రదించండి అంటూ వారు తెలియజేయడం జరిగింది. ఏదేమైనా ఇంటర్ విద్యార్థులను గొర్రెలను గొర్రెలను తరలించే బొలెరో వాహనంలో విద్యార్థులను తీసుకెళ్లడం ఎంతవరకు సబబు. చదువుకునే విద్యార్థులు ఇలాంటి వాహనాలలో వారి జీవితాలను పణంగా పెట్టి పరీక్ష కేంద్రాలకు వెళ్లడం సబబు కాదని విద్యార్థి సంఘాలు తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పరీక్షలను పరీక్షల నియమ వల్లి ఆ పరీక్షలకు సంబంధించిన గైడ్లైన్స్ కాపీలను ఎప్పుడో జిల్లా అధికారులకు అందించడంతోపాటు వాటిలో కూడుకున్న నియమ నిబంధనలు పూర్తిగా పాటించకుండా వాటిని అవలంబించకుండా ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇలాంటి ప్రధానోపాధ్యాయులు ఎందరో....అదేవిధంగా ప్రభుత్వ నుండి విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు ప్రభుత్వం ఆయా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులను కూడా మింగేయాలి దురుద్దేశంతో వీరికి నిత్యం సరుకులను సరఫరా చేసే బొలెరో వాహనాలను ఉచితంగా వాడుకోవడంలో సిద్ధహస్తులుగా మారిన హాస్టల్స్ వార్డెన్స్ ప్రధానోపాధ్యాయులు. ఇదేంటి అని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదు అంటూ సుద్దపూసల చేతులెత్తేస్తున్న ప్రబుద్ధులు..

# లీగల్ సర్వీస్ చర్యతో ఒడిస్సా వలస కూలీలకు విముక్తి

**ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ ఫిర్యాదుతో తక్షణమే న్యాయ విచారణ**

**న్యాయ విచారణ చేపట్టి ఒరిస్సా వలస కూలీలకు విముక్తి:**

**కే.అనిత ఎం ఎల్ ఎస్ సి చైర్మన్**



దేవరకొండ ఫిబ్రవరి 25 వార్త మిర్రర్:::నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చింతపల్లి మండల కేంద్రంలోని గొల్లపల్లి గ్రామం పరిధిలో ఎం ఆర్ ఇటుక బట్టీల కంపెనీ లో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన 109 వలస కూలీలు పని చేస్తున్నారు, వలస కూలీలు నిత్యం ఇబ్బందులకు గురవుతూ మైనరు పిల్లలు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నతరుణంలో ఇటికబట్టి సిబ్బంది వారిని హింసిస్తూ కఠిన ఇబ్బందులకు గురి చేస్తున్న ఒక కుటుంబం అక్కడనుండి తప్పించుకొని చిన్నపిల్లలతో నడుచుకుంటూ. కురంపల్లి వారాల పెదరామచంద్రశీ. పొలం మీదుగా వెళుతుండగా ఎవరు మీరు ఎక్కడ వెళుతున్నారని అడిగి సమస్యను అడిగి తెలుసుకుని వారిని చేర తీసుకొని భోజనం ఏర్పాటు చేసి వారికి కట్టుకోవడానికి వస్త్రాలు ఇచ్చి తనంతరం ఆల్ ఇండియా సమత సైనిక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.బుర్రి వెంకన్నకి సమాచారం ఇవ్వగా ఆయన తక్షణమే నియోజకవర్గ కన్వీనర్ జిల్లా రాములుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకొని అనంతరం నల్గొండ సఖి టీం వారికి అప్పజెప్పి చింతపల్లి పోలీస్ స్టేషన్లో విషయం తెలియపరచి మరుసటి రోజు వలస కూలీల సమస్యలను.దేవరకొండ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.అనిత కి ఫిర్యాదు చేయగా తక్షణమే ఆమె ఘటన స్థలానికి చేరుకొని వలస కూలీలను చిన్నారి పిల్లలను దగ్గరికి తీసుకొని వారి సాధకభాద కా లను అడిగి తెలుసుకొని. అక్కడ శ్రమదోపిడి చిన్నారులచే వెట్టిచాకిరి చేయిస్తున్నారని పూర్తి ఆధారాలు సేకరించి తనంతరం వారు వారికి విముక్తి లభించేలా వారిని వారి సొంత రాష్ట్రానికి తరలిం చారు. ఈ విషయం పైన తక్షణమే స్పందించి వారికి విముక్తి కలిగించిన దేవరకొండ న్యాయస్థానానికి సంబంధిత అధికారులు అందరికీ ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ రాష్ట్ర కమిటీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

# కేవలం లక్ష పెట్టుబడితో ప్రారంభించే ఇన్నోవేటివ్ బిజినెస్! కళ్లు చెదిరే ఆదాయం..




తక్కువ పెట్టుబడితో స్వయం ఉపాధికి మొబైల్ మైక్రోగ్రీన్స్ ఫార్మింగ్ అద్భుత అవకాశం. కేవలం రూ.1 లక్షతో ఈ వ్యాపారం ప్రారంభించి, ఇంటి టెర్రస్ నుండే మైక్రోగ్రీన్స్ పండించవచ్చు. సబ్‌స్క్రిప్షన్ ఆధారిత డోర్ డెలివరీ మోడల్‌తో నగరాల్లో పెరుగుతున్న డిమాండ్ ను అందుకోవచ్చు.తక్కువ పెట్టుబడితో స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలనుకునే యువతకు మంచి అవకాశం అందుబాటులో ఉంది. కేవలం రూ.1 లక్ష పెట్టుబడితో ప్రారంభించగల ఇన్నోవేటివ్ వ్యాపారంగా మొబైల్ మైక్రోగ్రీన్స్ ఫార్మింగ్ అండ్ డోర్ డెలివరీ మోడల్ ఇప్పుడు ట్రెండ్‌గా మారుతోంది. ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో ఈ వ్యాపారానికి నగరాలు, పట్టణాల్లో డిమాండ్ వేగంగా పెరుగుతోంది. మైక్రోగ్రీన్స్ అంటే చిన్న వయసులోనే కోసే పోషక విలువలు అధికంగా ఉన్న మొక్కలు. వీటిలో విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండటంతో ఫిట్‌నెస్ ప్రియులు, రెస్టారెంట్లు, ఆరోగ్యంపై దృష్టి పెట్టే కుటుంబాలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నాయి. ప్రత్యేకంగా బ్రోకోలీ, సన్‌ఫ్లవర్, వీట్‌గ్రాస్, రెడ్ క్యాబేజీ మైక్రోగ్రీన్స్‌కు మంచి మార్కెట్ ఉంది.ఈ వ్యాపారం ప్రారంభించడానికి పెద్ద స్థలం అవసరం లేదు. ఇంటి టెర్రస్ లేదా చిన్న గది సరిపోతుంది. ట్రేలు, విత్తనాలు, గ్రో లైట్లు, స్ప్రేయర్లు వంటి ప్రాథమిక సామగ్రితో రూ.70 వేల నుంచి రూ.1 లక్షలో సెటప్ సిద్ధమవుతుంది. పంట కేవలం 7--12 రోజుల్లో సిద్ధమవడం వల్ల వేగంగా టర్నోవర్ సాధ్యమవుతుంది. ఇన్నోవేటివ్ అంశం ఏమిటంటే.. కేవలం పండించడం కాకుండా “సబ్‌స్క్రిప్షన్ ఆధారిత డోర్ డెలివరీ” మోడల్‌ను అనుసరించడం. కస్టమర్లు వారానికి లేదా నెలకు ముందుగానే ఆర్డర్ ఇచ్చే విధంగా ప్లాన్ చేస్తే స్థిర ఆదాయం వస్తుంది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, లోకల్ ఫుడ్ గ్రూపుల ద్వారా మార్కెటింగ్ చేస్తే ప్రారంభ దశలోనే కస్టమర్ బేస్ ఏర్పడే అవకాశం ఉంది.మార్కెట్ అంచనాల ప్రకారం రోజుకు 20--30 ప్యాకెట్లు విక్రయించినా నెలకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు నికర లాభం సాధ్యమవుతుందని వ్యాపార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా యువత, గృహిణులు, పార్ట్‌టైమ్ ఆదాయం కోరేవారికి ఈ మోడల్ అనుకూలంగా ఉంటుంది. అయితే నాణ్యత, పరిశుభ్రత, సమయానికి డెలివరీపై దృష్టి పెట్టితేనే దీర్ఘకాల విజయం సాధ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తే, రూ.1 లక్ష పెట్టుబడి చిన్న వ్యాపారాన్ని పెద్ద బ్రాండ్‌గా మార్చే అవకాశముందని వారు అంటున్నారు. పంట కేవలం 7--12 రోజుల్లో సిద్ధమవడం వల్ల వేగంగా టర్నోవర్ సాధ్యమవుతుంది. ఇన్నోవేటివ్ అంశం ఏమిటంటే.. కేవలం పండించడం కాకుండా “సబ్‌స్క్రిప్షన్ ఆధారిత డోర్ డెలివరీ” మోడల్‌ను అనుసరించడం. కస్టమర్లు వారానికి లేదా నెలకు ముందుగానే ఆర్డర్ ఇచ్చే విధంగా ప్లాన్ చేస్తే స్థిర ఆదాయం వస్తుంది. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, లోకల్ ఫుడ్ గ్రూపుల ద్వారా మార్కెటింగ్ చేస్తే ప్రారంభ దశలోనే కస్టమర్ బేస్ ఏర్పడే అవకాశం ఉంది.మార్కెట్ అంచనాల ప్రకారం రోజుకు 20--30 ప్యాకెట్లు విక్రయించినా నెలకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు నికర లాభం సాధ్యమవుతుందని వ్యాపార నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా యువత, గృహిణులు, పార్ట్‌టైమ్ ఆదాయం కోరేవారికి ఈ మోడల్ అనుకూలంగా ఉంటుంది. అయితే నాణ్యత, పరిశుభ్రత, సమయానికి డెలివరీపై దృష్టి పెట్టితేనే దీర్ఘకాల విజయం సాధ్యమని నిపుణులు సూచిస్తున్నారు. సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తే, రూ.1 లక్ష పెట్టుబడి చిన్న వ్యాపారాన్ని పెద్ద బ్రాండ్‌గా మార్చే అవకాశముందని వారు అంటున్నారు.